కదా! వారి సహాయం అడగరాదా?"అని. అందుకు రాధ చిరునవ్వుతో, "ఏదయితే మనకి హృదయపూర్వకమైన వాత్సల్యంతో రాదో దానిని సంతోషంగా వదులుకోవడం మంచిదిగదా బాబుగారూ!" అన్నదిట. చివరికి రాధ ఎక్కడో చిన్న ఉద్యోగం సంపాదించి డబ్బుగడిస్తూ, భర్తని ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించిదట. ఇంట్లో చాకిరీ చేసి, పగలంతా ఆఫీసుపనిచేసి, రాత్రిళ్ళు నిద్ర మానుకుని భర్తకి పరిచర్యలు చేసేదిట. అహర్నిశలు శ్రమపడుతూ రాధ ఓరిమితో ధైర్యంతో కష్టాల్ని ఎదుర్కొంది. రవిని కంటికి రెప్పగా కాపాడుతూ ఎలాగయినా బతికించుకోవాలని ఆఖరిక్షణంవరకు మృత్యువుతో పోరాడింది..... తన జీవితంలో విలువైన వన్నీ భర్తకోసం త్యాగంచేసింది... కాని భగవంతుడు మెచ్చలేదు... చివరికి రవి అతని పెన్నిధి అయిన రాధ ఒడిలోనే చిరవిశ్రాంతి పొందాడు...పాపం! రాధ ఒంటరిదయిపోయింది...రాధకి జీవితంలో ఇంకేం మిగిలాయి—కన్నీళ్ళు మినహా...ఒక కళావేత్తని భర్తగా పొందాననీ, తన జీవితం స్వర్గతుల్యమనీ ఆనందించిన రాధ, తన సర్వస్వము భర్తకోసం త్యాగం చేసిన రాధ, సానుభూతికూడా కరువై ఒంటరిగా దుఃఖించిందట. రాధజీవిత కథనం అవాచ్యంగా పరిసమాప్తి అయింది. ఆమె కలలన్నీ కరిగిపోయాయి. కట్టుకున్న ఊహా సౌధాలన్నీ కూలిపోయాయి. తెర వాలిపోయింది... జీవితంలో పూర్తిగా దగాపడిన వ్యక్తి రాధ. ఎప్పుడు ఆలయంలో గంటలు విన్నా, ఎక్కడ చంద్రకాంతాలు చూసినా, ఆలయంలో రాధ, రాధ విషాదాంత జీవితకథనం, స్మృతికివచ్చి మనస్సు కలతపడుతుంది.

స్కెచ్

# సగం స్వాగతం

కె. రామలక్ష్మి

గోడకి కొంత ఎత్తునుంచి గది కప్పుదాకా వున్న కటకటాలకేసీ, దూలాలనుండి వింతగా వేలాడుతూన్న బూజుకేసీ, మూలలని వున్న సాలిగూళ్ళకేసీ చూస్తూ ఏదో తనకే తెలియని వాటిని గురించి ఆలోచిస్తున్న రామయ్య పంతులికి వీరాస్వామి పిలుపు భయంకరంగా తోచింది.

"ఏమిటి బాబూ అలా ఆలోచిస్తున్నావు? అయినా అలా ఆలోచించి బుర్రపాడు చేసుకోకు పంతులూ" అంటూ ఓదార్చాడు వీరాస్వామి.

"ఆలోచించడం లేదోయ్, ఏమిటో అలా చూస్తూవున్నానంతే" అని దృష్టి వీరాస్వామి మీదకి మళ్ళించారు రామయ్య పంతులు. బలమైన శరీరం, జబ్బకి నాటులా ఒక గీతవుండి పోయింది—తాయత్తు జైలులో తీసేశారు కాబోలు. జైలు యూనిఫారంలో వీరాస్వామి గమ్మత్తుగా వున్నాడు; తెల్లటి మల్లు పంచే, అడయారు లాల్చీలో ఎప్పుడూ చూసే రామయ్య పంతులు కూడా జైలు యూనిఫారంలో గమ్మత్తుగా కనిపించాడు వీరాస్వామికి.

"ఏం పంతులూ అట్టాఅట్టా పెద్దపెద్దోళ్ళతో విందులుచేసేవాడివే, యిప్పుడీ జైలుకూడెలా తిన కలుగుతున్నావోకదా!" నిట్టూర్చాడు వీరాస్వామి.

"చూడు పంతులూ, పొద్దుట పెరేడులో సూపరెంటు అడిగినప్పుడేనా చెప్పకూడదూ, యిక్కడ సరిపడ్డంలేదని" నువ్వొక్క చేతకాని వాడిలా వున్నావు. నాకే అలాంటి ఛాన్సువస్తేనా, అన్న ధోరణిలో అన్నాడు వీరాస్వామి.

"పోనిలే వీరాస్వామీ, ఇక్కడే బాగుంది—మీ అందరి మధ్యా-యిక్కడికి తీసుకొచ్చిన రోజు...ఆ మొదట్లో గదిలోవుంచారు. ఆ రాత్రి రాత్రి కాదనుకో తెల్లారు ఝామున..."

"నాకు తెలుసు పంతులూ, ఆగోడ కావలే ఉరి తీసేచోటు- రాత్రి ఎవర్నైనాఉరి తీసేరా?"

"నాకా సంగతే తెలియదనుకో. అయినా ఏదో ధన్‌ధన్ చప్పుళ్లు వినిపిస్తే లేచాను. చీకటి తప్ప ఏం కనిపించలేదు. ఏమిటో అలా ఒక్కణ్ణీ విడిగా వుండేకంటే, యిక్కడే బాగుంది."

"ఏంబాగు పంతులూ, అంత బతుకూ బతికి చెట్టుకింద సచ్చినట్లు ఆ కలకటేరులతోటీ పోలీసు పెద్దలతోటీ జబ్బా జబ్బా రాసుకు తిరిగేవే, ఏంటొచ్చిందో చూడు" పంతులు చేత కాని తనానికి వీరాస్వామికి కోపమేవచ్చింది. "పంతులూ, కోపం తెచ్చుకోకు, యిది చెప్పుదూ, ఆరోజు నా జట్కాలో ధవళేశ్వరం వెళ్లేవుకదా, దారిలో ఆ అమ్మినికూడా ఎక్కించాంగదా,...కోర్టులో ఆ సంగతి, అదీ చెప్తానంది, నేనూ చెప్తానన్నానుగదా, అన్నీ వద్దన్నావేం? చూడు, అదే చెప్పేసుంటే,...ఇంత దాకా వచ్చేదా?" వీరాస్వామి ఆగాడు—

పంతులు నిట్టూర్చాడు. అవును—వీరాస్వామి చెప్పినది నిజమే. ఆరోజు సాక్షులుగా యీయిద్దరినీ పిలిచివుంటే, తనిక్కడికి రానక్కరలేదు. అయినా తనలా చేయలేదు. యిప్పుడు...ఈ ప్రశాంతంలో ఎందుకలా చెయ్యలేదని రామయ్య పంతులు ఆలోచించడంలేదు. ఆరోజే ఆలోచించారు. డబ్బుకోసం తమతోకూడా వచ్చిన ఆ అమ్మినా బయటపెట్టడం?

తను జైలుకి వచ్చింతరువాత, చూడవచ్చిన స్నేహితులూ, చుట్టాలూ అందరూ—తను ఏగొడవ లేకుండా బైటికివచ్చేసే సులభోపాయాలుచెప్పారు. కాని తనకేం నచ్చలేదు. నచ్చకపోవడం కాదు. అంతరాత్మ ఒప్పుకోలేదు. ఈచిన్నివిషయంలో తన మనస్సొప్పక పోవడం తల్చుకొంటే నవ్వొచ్చింది రామయ్య పంతులుకి. దారుణమైన వెన్నెన్నో వెనక్కేనా తిరిగిచూడకుండా చేసేసిన రామయ్య పంతులేనా నేను అనుకొన్నారు.

లోకాభిరామాయణంతోపాటే సాగుతున్న తన స్వగతాన్నికూడా మరిచి ఎక్కడో కొంచెం అలికిడిఅయి 'ఏమిటి వీరాస్వామీ అది' అన్నారు.

"ఏంలేదుబాబూ, అటుచూడండి," అన్నాడు వీరాస్వామి. చాలామంది ఖైదీలు, ఎలాగో వూచల వెంబడి ఎగప్రాకి అవతల జరుగుతున్న ఏదో వింతని చూస్తున్నారు. రామయ్య పంతులుకూడా ఎలాగో లేచి చూడవెళ్లేరు. వార్డర్లమధ్య పూల మాలలతో నడుస్తూ భజనచేస్తున్నాడో ఖైదీ. ఉరితీసేముందు—అతని ఆఖరుకోరిక అది. పిచ్చివాడు భజనచేస్తూ చనిపోతే, స్వర్గానికీ, రంభాసాన్నిధ్యానికీ వెళ్లిపోతానని కాబోలు!

"ఎవడు వీరాస్వామీ అది?"

"వాడు బాబూ, చాకలివెంకడు. యింటిదాన్ని అనుమానించి చంపబోయి అడ్డొచ్చిన అత్తని చంపేశాడు... ఈ మధ్యలో సాములారయిపోయాడు బాబూ." నవ్వేడు వీరాస్వామి; చాకలివెంకడి భక్తికిరామయ్యకీ నవ్వువచ్చింది.

ఇంకాపూర్తిగా తెల్లవారలేదు. జైలు ఎప్పుడూ పెళ్ళివారిల్లులా కలకల్లాడుతూనే వుంటుంది. కళ్లు మూయడానికిభయపడేఖైదీలు కబుర్లుచెప్పుకుంటూ పగలూ రాత్రీకూడ కాలక్షేపం చేసేస్తారు.

"ఏటో పంతులు పిచ్చి! చాకలి వెంకడు ఉరేసుకు పోయాడు. నిన్ననే వాడిపెళ్లాం, పోలీసురామస్వామితో కలసిచూడ్డానికి వచ్చింది. వెంకడు అసలు అందుకే దాన్ని చంపేద్దాం అనుకున్నాడు. కాని, ఈవేళ వాడు ఉరేసుకుపోయాడు. అదేమో హాయిగావుంది—ఈ పంతులికి అమ్మిమీద అంత మమకారం ఏంటి?"

"అసలు పంతులెందుకు జైలుకొచ్చాడు ఈరాసామీ!" ప్రశ్నించాడొక ఖైదీ.

"ఆ ఎందుకేటి? చాతకాక. కలకటేరు డబ్బుచ్చుకున్నాడు. అక్కడ నేనూ, ఆ అమ్మీ కూడావున్నాం. ఆసంగతి చెప్పేత్తాం అంటే ఒద్దన్నాడు. ఏటో అంతవిశ్వాసం ఏంటి మనుషుల మీద!" వీరాస్వామితన ధోరణిలో అన్నాడు.

కునుకుపడుతూ మగతలోవున్న పంతులు యీ మాటలు విన్నాడు. వీరాస్వామి వేదాంతానికి ఆయనకి నవ్వొచ్చింది. తనది నిజంగా చేతకాని తనమేనేమో!...ఆలోచనలోనే వుండిపోయాడు పంతులు. అయినా జైలు కటకటాలూ, దూలాల బూజులూ కన్పిస్తూనే వున్నాయి. వీరాస్వామి పాడుతూన్న తత్వం విన్పిస్తూనేవుంది...వీటన్నిటినీ చీల్చుకుంటూ జైలుబిగిల్ విన్పిస్తూంది. బద్ధకంగా లేచి గొంగళీ మడిచాడు రామయ్య పంతులు.

మళ్ళీ జైలులో, వూళ్ళోలాగే యింకో పగలు ప్రారంభమయింది.

★